ప్రమాదకరంగా ఫతేనగర్ ఫ్లైఓవర్

● ఇరుకు వంతెనతో నరకం ● పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ● రాత్రి వేళ ఇటుగా వెళ్లేందుకు వణుకు

నిర్వహణ లోపం వల్ల ఫతేనగర్ ఫ్లైఓవర్ ప్రమాదకరంగా మారింది. నిర్వహణను జీహెచ్ఎంసీ గాలికి వదిలేయడంతో రోడ్డు ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

సనత్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్, బాలానగర్, బల్కంపేట పరిసర ప్రాంతాల రవాణాకు కీలకంగా మారిన ఫతేనగర్ ఫ్లైఓవర్ నిర్వహణ లేమితో ప్రయాణీకులకు నరకం చూపిస్తోంది. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో ఫతేనగర్ రైల్వేక్రాసింగ్‌పై సనత్‌నగర్, బల్కంపేట, ఫతేనగర్‌లను కలుపుతూ వై ఆకారంలో ఫ్లైఓవర్‌ను రైల్వే, రోడ్డు భవనాల శాఖలు సంయుక్తంగా కలిసి నిర్మించాయి. అనంతరం దీని నిర్వహణను జీహెచ్ఎంసీకి అప్పగించాయి. గతంలో ఫ్లైఓవర్ రెయిలింగ్‌కు రంగులు మాత్రమే వేసిన జీహెచ్ఎంసీ చేతులు దులుపుకుంది. నిర్వహణ నిర్లక్ష్యం చేయడంతో ఫ్లైఓవర్ శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జిపై మట్టికుప్పలు పేరుకుపోయాయి. ఫుట్‌పాత్ టైల్స్ పగిలిపోయాయి. రోడ్డు కూడా పాడైంది. కనీసం వీధిదీపాలు కూడా లేకపోవడంతో రాత్రి సమయంలో అంధకారం నెలకొంది. ఈ కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఫతేనగర్ ఫ్లైఓవర్‌పై నుంచి ప్రయాణించాలంటేనే వాహనదారులు వణికి పోతున్నారు. దానికి తోడు ట్రాఫిక్ కూడా విపరీతంగా పెరగడంతో అవసరమైన వారు తప్పితే మిగతా వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణిస్తున్నారు. బ్రిడ్జి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయడంతో రోడ్డు కుచించుకుపోయి కేవలం ఒక వాహనం మాత్రమే వెళ్లే స్థలం మాత్రమే మిగిలి ఉంది. దాంతో ముందు ఓ కారు వెళితే వెనక ఉన్న వాహనాలు అనుసరించాలి తప్పితే ఓవర్‌టేక్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఫ్లై ఓవర్‌తోపాటు కింద ఉన్న సర్వీస్ రోడ్డును విస్తరించి, ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ఫ్లైఓవర్ పైకి వెళ్లే మెట్ల వద్ద పరిస్థితి


రోడ్డు పక్కన పేరుకున్న చెత్త

పెరిగిన ఆక్రమణలు

ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణతోపాటు కింద ఉన్న సర్వీస్ రోడ్డును కూడా విస్తరించే అవకాశముంది. ఇలా చేయడం వల్ల సనత్‌నగర్, బల్కంపేట, ఫతేనగర్, బాలానగర్ వెళ్లే వారికి మార్గం సుగమం అవుతుంది. వంతెన విస్తరణ జరగకపోవడం, రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా కింద ఉన్న రోడ్డుపై ఆక్రమణలు పెరిగిపోయాయి. వంతెన కింద ఉన్న రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. బ్రిడ్జి కింద ఉన్న స్థలంలో రసాయన డ్రమ్ములు, పాత వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. మరికొంతమంది వాహనాల పార్కింగ్ కోసం ఈ స్థలాన్ని వినియోగిస్తున్నారు. ఇలా ఆక్రమణలు, అక్రమ పార్కింగ్, డంపింగ్‌లు పెరగడంతో రోడ్డు కుచించుకుపోయింది. కింద రోడ్డు కుచించుకుపోవడంతో బ్రిడ్జిపై రద్దీ పెరుగుతోంది.

నిర్వహణ శూన్యం

వంతెనను నిర్వహించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఫతేనగర్ ఫ్లైఓవర్ శిథిలావస్థకు చేరింది. చాలా ప్రాంతాల్లో బ్రిడ్జి బీటలు వారింది. వంతెన పైకి వెళ్లేందుకు ఫతేనగర్, సనత్‌నగర్ వైపు ఉన్న మెట్లు ధ్వంసమయ్యాయి. వంతెనపై రోడ్డు కోతకు గురై గుంతలమయంగా మారింది. రోజూ వెళ్లే వాహనాల సంఖ్య పెరగడంతో బ్రిడ్జిపై రోడ్డు ధ్వంసమైంది. చాలాచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. కనీసం విద్యుత్‌దీపాలు కూడా లేకపోవడంతో బ్రిడ్జి పైన, కింద కూడా అంధకారం అలముకుంది. చీకటిగా ఉండడంతో ఆక్రమణలతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు కూడా ఈ ఫ్లైఓవర్ అడ్డాగా మారుతోంది. ఫతేనగర్, బాలానగర్, సనత్‌నగర్‌లోని సంస్థలకు కూడా ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ నెలకొంటోంది.


ఫ్లైఓవర్ కింద వాహనాల పార్కింగ్, ఆక్రమణలు

నిలిచిన విస్తరణ పనులు

గతంలో ఫ్లైఓవర్‌కు ఎలాంటి నష్టం కలగకుండా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సనత్‌నగర్, ఫతేనగర్, బల్కంపేట వైపు మరో రెండు లైన్లు విస్తరిస్తే తప్ప ట్రాఫిక్ రద్దీని తట్టుకోవడం కష్టంగా మారుతుందని గుర్తించారు. నిర్ణయం అయితే తీసుకున్నారుగానీ కార్యాచరణలోకి తీసుకు రాలేదు. బల్కంపేట వైపు నుంచి రెండు లైన్లు నిర్మించి ఫ్లైఓవర్‌కు జత చేస్తే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుంది. అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రతిపాదనలతో బ్రిడ్జి విస్తరణకు నిధులు మంజూరయ్యాయి. కారణం ఏదైనా నిధులు మంజూరై రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు విస్తరణ పనులు కార్యరూపం దాల్చలేదు. రైల్వే, రోడ్డు భవనాల శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాల్సి రావడంతో కొంత జాప్యం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని మోసం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆడిషన్స్‌లో పాట పాడేందుకు వచ్చిన యువతిని చూశాడు. ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని శారీరక సంబంధం పెట్టుకొని గర్భం దాల్చిన తర్వాత ముఖం చాటేసిన వర్ధమాన సంగీత దర్శకుడిని పోలీసులు అరెస్టు చేశారు. మహబూబాబాద్‌కు చెందిన కళ్యాణ్ వర్ధమాన సంగీత దర్శకుడు. కొద్దికాలం క్రితం ఓ ఆడిషన్స్‌కు హాజరయ్యాడు. ఇదే ఆడిషన్స్‌కు వచ్చిన యువతి(24)పై మనసు పారేసుకున్నాడు. ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. గర్భం దాల్చిన తర్వాత మాయమాటలు చెప్పి తీయించాడు. పెళ్లి చేసుకోమని యువతి ఒత్తిడి తేవడంతో ముఖం చాటేశాడు. బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని కళ్యాణ్‌ను అరెస్టు చేశారు.

మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

యుసుఫ్‌గూడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'నా స్థలంలో అక్రమంగా నిర్మాణం చేయడం సరికాదు తొలగించండి' అని అడిగిన మహిళను నిర్మాణం చేస్తున్న వ్యక్తి బెదిరించారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెహ్మత్‌నగర్‌లో గద్వాల శారదాబాయ్ తన స్థలంలో రేకులషెడ్డు వేసి వాస్తు ప్రకారం దక్షిణ దిక్కులో కొంత స్థలం వదిలి ఆ స్థలంలో డ్రైనేజీ పైప్‌లైన్‌కు ఉపయోగిస్తూ తన పిల్లలతో నివాసం ఉంటోంది. కొన్ని రోజుల క్రితం ఆమె పిల్లలతో కలిసి సొంతూరుకు వెళ్లి వచ్చే సరికి పక్కింటి వ్యక్తి ఎల్.బుచ్చయ్య శారదాబాయ్ స్థలంలో గోడ కట్టాడు. తిరిగి వచ్చిన శారదాబాయ్ తన స్థలంలో గోడ కట్టడం సరికాదని నిలదీయడంతో బుచ్చయ్య గోడను తొలగిస్తానని చెప్పాడు. రోజులు గడుస్తున్నా తొలగించకుండా నిర్మాణ పనులు చేస్తుండడంతో ఆమె మరోసారి గోడ తొలగించాలని కోరింది. దీంతో బుచ్చయ్య కోపంతో 'నిన్ను.. నీ పిల్లలను జైలుకు పంపుతా నా అల్లుడు డీఎస్పీ, నా కూతురు జలమండలి అధికారి, స్థానిక కార్పొరేటర్ పీఏ రజినీకాంత్ నా వెంట ఉన్నాడు' అని బెదిరించాడు. దీంతో శారదాబాయ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఇల్లు ఇప్పిస్తానని మోసగించిన బీఆర్ఎస్ నాయకుడిపై..

బోరబండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని మోసం చేసిన బీఆర్ఎస్ నాయకుడు విజయసింహపై బోరబండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయసింహ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని పలువురు మహిళల వద్ద డబ్బులు వసూలు చేశాడు. ఇల్లు రాకపోవడంతో బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరారు. ఆయన డబ్బులు ఇవ్వకపోవడంతో బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడు అరెస్ట్


శ్రీనివాస్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే బాలిక(17) ఓ ప్రైవేట్ పాఠశాలలో పదోతరగతి చదువుతుంది. సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లే సమయంలో ఓ యువకుడు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ నెల 20న అతడు మరింత ఇబ్బంది పెట్టడంతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. తల్లిదండ్రులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. నిందితుడు శ్రీనివాస్‌గా గుర్తించి గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఫోర్జరీ పత్రాలతో అక్రమంగా చొరబడ్డారని ఫిర్యాదు

యుసుఫ్‌గూడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో అక్రమంగా స్వీట్ షాపులోకి వచ్చి బెదిరించారని ఓ వ్యక్తి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ ప్రాంతంలో నివాసం ఉంటున్న హరీష్ సేతికి ఎల్లారెడ్డిగూడ జయప్రకాష్‌నగర్ ఎంఎంఎస్ చాంబర్ అనే భవనం ఉంది. దీనిలోని గ్రౌండ్ ఫ్లోర్‌ను దినేష్ కచ్వా అద్దెకు తీసుకుని ఆగ్రాస్వీట్స్ పేరుతో మిఠాయి దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9న బాసుమతి ఘోష్, అనామికా ఘోష్, బిష్ణుప్రసాద్ ఘోష్, చిరంజిత్ ఘోష్, రాజేష్ యాదవ్ తదితరులు ఫోర్జరీ పత్రాలతో బలవంతంగా షాపులోకి వచ్చి పనివారిపై దుర్భాషలాడారు. షాపును స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. ఆ పత్రాలు ఫోర్జరీ చేసినవని, నిపుణులతో తనిఖీ చేయించాలని, అక్రమంగా షాపులోకి వచ్చిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని భవన యజమాని హరీష్‌సేతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పబ్‌లో నగదు, మద్యం బాటిళ్ల చోరీ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పబ్‌లో చోరీ జరిగింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10లోని ఆర్‌యు పబ్‌లో కొన్ని రోజులుగా నగదు, మద్యం సీసాలు చోరీ అవుతున్నట్టు గుర్తించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా పబ్ సెక్యూరిటీగార్డు వినీత్‌కుమార్ ఈ నెల 16న క్యాష్‌కౌంటర్ వద్ద తచ్చాడుతూ కనిపించాడు. వెంటనే సిబ్బంది అతడిని సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. లెక్కలు చూడగా క్యాష్‌కౌంటర్‌లో రెండు లక్షల నగదు, ఐదు ఖరీదైన మద్యం సీసాలు చోరీ అయినట్టు గుర్తించారు. పబ్ మేనేజర్ రయన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగలున్న బ్యాగ్..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్వర్ణ ఆభరణాలు ఉన్న బ్యాగ్ చోరీ అయింది. జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో నివాసముండే సతీష్, సీహెచ్ పద్మావతి దంపతులు ఈ నెల 14న బంధువుల వివాహం ఉండడంతో ఏపీలోని గుంటూరుకు బయలు దేరారు. ఈ సమయంలో 26 గ్రాములు నక్లెస్, 56 గ్రాముల బ్లాక్ బీడ్స్, నాలుగు గ్రాముల విలువ చేసే రెండు బంగారు ఉంగరాలు, మూడు గ్రాముల వజ్రాలు పొదిగిన కమ్మలు, 32 గ్రాముల బంగారు గాజులు ఇతర అభరణాలను ఓ బ్యాగులో పెట్టుకొని వెళ్లారు. ఈ నెల 17న బస్సులో నగరానికి చేరుకున్నారు. అమీర్‌పేట సారథి స్టూడియో వద్ద బస్సు దిగాక ఆభరణాలు ఉన్న బ్యాగ్ కనిపించలేదు. వెంటనే ఆటోలో నందగిరి హిల్స్‌కు చేరుకొని ఇంట్లో వెతికారు. కనిపించకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి అదృశ్యం


పాండురంగయ్య

ఖైరతాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కుటుంబ సమస్యలు, ఆర్థిక బాధలతో మానసిక ఆరోగ్యం బాలేక ఓ వ్యక్తి కనిపించకుండా పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెపోగు పాండురంగయ్య(28)కు భార్య సునీతదాస్, ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో మణికొండలో విక్టరీ స్టార్ క్రికెట్ అకాడమీని నడిపేవాడు. సంవత్సరం క్రితం అది మూతపడింది. పాండురంగయ్య తొలుత బోరబండలోని అద్దె ఇంట్లో భార్య, పిల్లలతో ఉన్నాడు. అనంతరం ఆర్థిక బాధలతో బాలానగర్‌లోని తల్లి ఇంటికి వెళ్లాడు. అక్కడ కుటుంబ సభ్యులతో గొడవలు జరగగా మానసికంగా చాలా ఇబ్బంది పడ్డాడు. గత్యంతరం లేని పరిస్థితిలో ఖైరతాబాద్‌లోని తన అత్తవారింటికి వచ్చాడు. భార్య పనిచేసే స్థలానికి ఈ నెల 19న వచ్చి కలిసి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా, ఆచూకీ తెలియక పోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లోగాని, 9912820552లోగాని సంప్రదించాలని ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

కల్లు దుకాణంలో విధులకు వెళ్లి..

యుసుఫ్‌గూడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కల్లు దుకాణంలో విధులు నిర్వహించేందుకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేమూరి బాల్‌రాజ్ అనే వ్యక్తి గాజులరామారంలోని కొడుకు, కోడలు వద్ద నివాసం ఉంటున్నాడు. 30 ఏళ్లుగా యూసుఫ్‌గూడలోని కల్లు దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 20న కల్లు దుకాణానికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. 21న అతడి కోడలు స్వాతి కల్లు దుకాణానికి వచ్చి ఆరా తీసింది. 20వ తేదీ విధులకు వచ్చి వెళ్లాడని వారు తెలిపారు. చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు

బోరబండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న కేంద్రాలపై బోరబండ పోలీసులు దాడులు చేశారు. భారీగా సిలిండర్లతోపాటు ఫిల్లింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

టీఎస్ఆర్టీసీ ఎస్ అండ్‌డబ్ల్యూ సెక్రెటరీ జనరల్‌గా హన్మంతుముదిరాజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ జనరల్‌గా కె.హన్మంతు ముదిరాజ్‌ను నియమించినట్టు ఐఎన్‌టీయూసీ కేంద్ర అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి తెలిపారు. రాష్ట్ర రోడ్ రవాణా సంస్థలో ఐఎన్‌టీయూసీ లక్ష్యాలకు అనుగుణంగా కార్మికుల మధ్య ఐక్యతను పెంచి సంఘం పటిష్టత కోసం ప్రతిపాదించిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సంజీవరెడ్డి ఈ సందర్భంగా హన్మంతు ముదిరాజ్‌కు సూచించారు. 2017, 2021 పీఆర్‌సీల అమలు కోసం పోరాడుతామని హన్మంతు ముదిరాజ్ పేర్కొన్నారు.

చిన్న ఫార్మా కంపెనీలపై దాడులను ఆపాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మా కంపెనీలకు భూమి కేటాయిస్తామని, ఇతర ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పి నమ్మక ద్రోహం చేసిందని జై భీమ్ యూత్ ఇండియా, తెలంగాణ పర్యావరణ పరిరక్షణ మండలిలు ఆరోపించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయకుండా చూడాలని ఆయా సంఘాల నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జై భీమ్ యూత్ ఇండియా అధ్యక్షుడు సింభన్, శ్రీహరి, జి.నర్సింహారావు, జె.శంకర్, తదితరులు మాట్లాడారు. పెద్ద ఫార్మా కంపెనీల కోసం చిన్న పరిశ్రమలను బలి చేయడం తగదన్నారు. తప్పు చేసిన ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకోవాలేగానీ వేధించడం, ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు ఔషధ నియంత్రణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలిలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అధికారులను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన పొదుపు పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. గురువారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఖైరతాబాద్‌లో తపాలా పథకాలపై అవగాహన కల్పించారు. పలు బస్తీలతోపాటు స్థానిక సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తపాలా సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ సీనియర్ పోస్ట్ మాస్టర్ జేఎస్ఎంవీఆర్ ప్రసాద్, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ శ్రీనివాసులు, ప్రతినిధులు వాసు, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ సతీమణి హబీబా సుల్తానా

సైట్-1లో అన్నదానం

బోరబండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో కంటే అన్నదానం మిన్న అని మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ మహ్మద్ బాబాఫసియుద్దీన్ అన్నారు. గురువారం గ్యార్వీ షరీఫ్ సందర్భంగా సైట్-1లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఘనంగా నిత్యానంద త్రయోదశి వేడుకలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి(స్వర్ణ) ఆలయంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం నిత్యానంద త్రయోదశి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణుడి సోదరుడైన బలరాముడి అవతారమే నిత్యానందగా పశ్చిమబెంగాల్లో భావిస్తారు. ఈ మేరకు నిత్యానంద విగ్రహానికి 108 కలశాలతో నితాయ్ గౌరాంగ్ అష్టోత్తర శత కలశ మహాభిషేకం నిర్వహించారు. 56 రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మూవ్‌మెంట్ నిర్వాహకుడు సత్యగౌరచంద్రదాస, తదితరులు పాల్గొన్నారు.

మహిళల వ్యాధులపై అవగాహన అవసరం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహిళల వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. ఎండోమెట్రియోసిస్ అవేర్‌నెస్ నెలలో భాగంగా డాక్టర్ రూమ్ సిన్హాతో కలిసి పెయిర్ అకాడమీ, అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఓపెన్ ఎయిర్ యాంఫీ థియేటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఎండోమెట్రియోసిస్ అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్ల మంది మహిళలను ప్రభావితం చేసే ఒక ఆరోగ్య పరిస్థితి అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ సమాజంతోపాటు కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలంటే మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అపోలో ఆస్పత్రుల ఎంటర్‌ప్రైజెస్ సీఎస్ఆర్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కామినేని మాట్లాడుతూ మహిళలు తమ భావాలను వ్యక్తం చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్, ఎండోమెట్రియోసిస్ స్పెషలిస్ట్ డాక్టర్ రూమా సిన్హా, పేషెంట్ అకాడమీ ఫర్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ రత్నాదేవి, డాక్టర్ కార్మాన్ నెజాట్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో కాంగ్రెస్ నిర్లక్ష్యం : తలసాని

సనత్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. గురువారం ఆయన సనత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని గ్రౌండ్ పరిసరాల్లో పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా వదిలేయడం వల్ల రాత్రి వేళల్లో మద్యం ప్రియులకు అడ్డాగా మారిందని స్థానికులు ఎమ్మెల్యేకు చెప్పారు. అంతేకాకుండా వారాంతపు సంతలో భాగంగా గ్రౌండ్ లోపల కూడా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. స్పందించిన ఆయన గ్రౌండ్‌ను అభివృద్ధి చేసేందుకు, సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి, ఈఈ ఇందిర, మోహన్, హరిశంకర్, అమర్‌నాథ్, కొలను బాల్‌రెడ్డి, నాయకులు రాజేష్ నోమాన్, జమీర్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

నిమ్స్‌ను సందర్శించిన కేంద్ర ఆరోగ్యశాఖ బృందం


కేంద్ర ఆరోగ్యశాఖ బృందంతో సమావేశమైన నిమ్స్ వైద్యులు

సనత్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిని నేషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి దీప్తీ గౌర్, నేషనల్ హెల్త్ అథారిటీ అడిషనల్ సీఈఓ డాక్టర్ బసంత్‌గార్గ్, తెలంగాణ ఆరోగ్యశ్రీ సీఈఓ ఆర్. విశాల్‌తో కలిసి గురువారం సందర్శించారు. వీరిని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందంలో అధికారులు డయాలసిస్ సెంటర్‌కు తీసుకెళ్లి అక్కడ ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న చికిత్స గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం ద్వారా, ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ లిజారాజశేఖర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ లక్ష్మీభాస్కర్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ స్వర్ణలత, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

రేపు ఉచితంగా యూఎస్ఏ ఎడ్యుకేషన్ ఫెయిర్

పంజాగుట్ట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం యూనిస్కోలర్స్, యునిక్రెడ్స్ సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 24న సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డులోని యూనిస్కోలర్స్ సంస్థ కార్యాలయంలో ఉచితంగా యూఎస్ఏ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని సంస్థ బిజినెస్ హెడ్ రాజ్ నున్న, రీజినల్ మేనేజర్ రాజేష్ వెలమర్తి, యునిక్రెడ్స్ సంస్థ రీజినల్ మేనేజర్ భవ్య బండ గురువారం తెలిపారు. అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు యూనివర్సిటీ ప్రతినిధులతో స్వయంగా చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఫీజులు, స్కాలర్‌షిప్, విద్య, ఉపాధి అవకాశాలు, విద్య విధానంలో వస్తున్న మార్పులు, తదితర అంశాలను తెలుసుకోవచ్చన్నారు. అమెరికాలోని దాదాపు 15కు పైగా యూనివర్సిటీలు, కాలేజీల ప్రతినిధులు ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గంచెరువు ప్రాంతంలో రహదారి వెడల్పు పనులు, మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఏడీఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీసీ ఫీడర్ పరిధిలో ఉదయం 12 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్‌సీసీ బిల్డింగ్, నెక్టార్‌గార్డెన్, రత్నదీప్ సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

'వికసిత్ భారత్ వికసిత్ రైల్వే' పోటీల్లో నాలుగు రాష్ట్రాల విద్యార్థులు

● 26న విజేతలకు ప్రధాని బహుమతుల ప్రదానం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో గురువారం '2047-వికసిత్ భారత్ వికసిత్ రైల్వే' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్, వక్తృత్వ పోటీల్లో 37,351 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భారతీయ రైల్వేలపై అవగాహన పెంచాలనే లక్ష్యంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలలోని 269 పాఠశాలల్లో పోటీలు నిర్వహించారు. ప్రధానంగా హైదరాబాద్ డివిజన్ పరిధిలోని 60 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 7,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు సికింద్రాబాద్ డివిజన్‌లోని 42 పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో 5326 మంది విద్యార్థులు పాల్గొనగా 126 మంది వివిధ విభాగాల్లో విజేతలుగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ డివిజన్‌లో 55 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 11,235 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గుంటూరు డివిజన్‌లోని 25 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 3010 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. గుంతకల్ డివిజన్ పరిధి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లోని 39 పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో 6780 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మహారాష్ట్ర నాందేడ్ డివిజన్ పరిధిలోని 48 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 3,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిల్లో గెలుపొందిన విద్యార్థులకు ఫిబ్రవరి 26న ప్రధాని నరేంద్రమోదీ బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తారని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలియజేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● 'హవానా' ప్రారంభోత్సవంలో బీఎస్ఎన్ఎల్ జీఎం రాజేశ్వరి

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టెలీకమ్యూనికేషన్స్ రంగంలో వీజీ సాంకేతికతను అమలు చేస్తున్న ప్రస్తుత తరుణంలో స్టార్టప్‌లను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని వర్ధమాన ఇంజనీర్లకు సంగారెడ్డిలోని భారతీయ సంచార నిగం(బీఎస్ఎన్ఎల్) ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ డి.రాజరాజేశ్వరి పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా రుద్రారం సమీపంలోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో హవానా పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సాంకేతిక కార్యక్రమాన్ని గురువారం జ్యోతి ప్రజ్వలనతో ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్‌లో తన ఇరవై ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం, అందులో సాంకేతిక పరిజ్ఞానం ఎదిగిన తీరును రాజేశ్వరి వివరించారు. గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి మాట్లాడారు. సాంకేతికోత్సవంలో దేశ నలుమూలలకు చెందిన 30 కళాశాలల నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏటీఐ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి గంగాధర్, ఫీనిక్స్ గ్లోబల్ సహ వ్యవస్థాపకుడు ఆయుష్ గోస్వామి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజేశ్వరి



డివిడెండ్ చెల్లింపులో అధ్యక్షుడు స్వామి, బోర్డు సభ్యులు, కార్యాలయ సిబ్బంది

పెండింగ్ డివిడెండ్ చెల్లింపు

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : దక్షిణమధ్య రైల్వే ఉద్యోగుల సహకార పరపతి పరిమితి సంఘం షేర్ హోల్డర్లకు పెండింగ్‌లో ఉన్న డివిడెండ్‌ను వారి ఖాతాల్లో జమచేసినట్లు సంఘం అధ్యక్షులు చిలుకు స్వామి తెలిపారు. 44వేల మంది షేర్‌హోల్డర్‌లకు రూ.15కోట్లు చెల్లించినట్లు తెలిపారు. 2022-23 సంవత్సరానికి గాను డివిడెండ్ గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో చెల్లించవలసి ఉండగా కోర్టు కేసులు, సంఘం ఎన్నికల కారణంగా ఆలస్యం అయినట్లు తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా పోటీ సమయంలో ఇచ్చిన హామీ అధ్యక్షుడిగా ఎన్నికైన వారం రోజులలో డివిడెండ్ చెల్లించడం సంతోషంగా ఉందని అధ్యక్షుడు స్వామి తెలిపారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శ్యాంసుందర్‌గౌడ్, సారంగపాణి తదితరులు

చిలకలగూడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్, చిలకలగూడ శ్రీదేవి థియేటర్ ఎదురుగా వున్న బీజేపీ కార్యాలయాన్ని గురువారం బీజేపీ మహంకాళి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ రిబ్బన్ కట్ చేసి లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్ఠతకి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ హ్యాట్రిక్ సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, యం.చంద్రశేఖరరావు (ఇంద్రన్న) కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతాఫల్‌మండి దేడ్‌లాక్ భవనం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

● కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ప్రజలను కోరారు. సీతాఫల్‌మండి దేడ్‌లాక్ భవనం ఉన్న ఖాళీ ప్రదేశంలో చెత్తవేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయటంతో గురువారం మెడికల్ ఆఫీసర్ వెంకటరమణతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలని, ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే తమ దృషికి తీసుకురావాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. బీఆర్ఎస్ నాయకుడు రాజుసుందర్ తదితరులు పాల్గొన్నారు.



భారత్ జోడో న్యాయ్ యాత్రలో వేణుగోపాలస్వామి

కేంద్రంలో కాంగ్రెస్‌కు అధికారం ఖాయం

భారత్ జోడో న్యాయ్ యాత్రలో వేణుగోపాలస్వామి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకోవడం ఖాయమని ఆ పార్టీ నాయకుడు వేణుగోపాలస్వామి అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ నుంచి మెట్టుగూడ వరకు గురువారం భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి మాట్లాడుతూ పదేళ్లలో అభివృద్ధిని విస్మరించి, కేవలం హిందుత్వం, రాముని పేరును అడ్డం పెట్టుకుని బీజేపీ లబ్ది పొందాలని చూస్తోందని విమర్శించారు. రాముడిని అందరం పూజిస్తామని, దేవుడిని రాజకీయాల్లోకి లాగడమే ఆక్షేపణీయమని వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి సోదరభావంతో జీవిస్తుంటారని పేర్కొన్నారు. అందరికీ సమాన హక్కులు ఉండాలన్నదే కాంగ్రెస్ పార్టీ విధానమని, ఆశయమన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారిని ఢీకొన్న కారు

తిరుమలగిరి ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పండ్ల వ్యాపారం చేసుకునే ఓ వృద్ధుడిని డాక్టర్ కారుతో ఢీ కొట్టిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం అల్వాల్ రాజీవ్ వీకర్ సెక్షన్‌కు చెందిన పాషా(60) పండ్ల వ్యాపారి. 14వ తేదీన రాత్రి సమయంలో అల్వాల్ వద్ద రోడ్డు దాటుతుండగా కిమ్స్ హాస్పిటల్‌లో న్యూరాలజీ ఫిజిషయన్‌గా పనిచేస్తున్న చిక్కడపల్లికి చెందిన కార్తిక్ బొల్లారం రైతుబజార్ నుండి తిరుమలగిరి వైపు స్విఫ్ట్ డిజైర్ కారులో వస్తుండగా మెయిన్ రోడ్డు రాగా పాషాను ఢీ కొట్టాడు. దీంతో పాషాకు ఎడమ కాలు విరిగిపోవడంతో పాటు ఛాతీ, తలకు బలమైన గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పాషా కుమారుడు ఇమ్రాన్ చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అత్తాపూర్‌లోని జర్మన్‌టెన్ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా, అక్కడి నుంచి డాక్టర్ పరార్ అయ్యాడు. కార్ఖానా వద్ద వాహనాలను చెకింగ్ చేస్తున్న పోలీసుల ద్వారా అదుపులోకి తీసుకొని కారుని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం పాషా ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీఎస్ఆర్టీసీ ఎస్ అండ్ డబ్ల్యూ సెక్రెటరీ జనరల్‌గా హన్మంతుముదిరాజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ జనరల్‌గా కె.హన్మంతు ముదిరాజ్‌ను నియమించినట్టు ఐఎన్‌టీయూసీ కేంద్ర అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి తెలిపారు. రాష్ట్ర రోడ్ రవాణా సంస్థలో ఐఎన్‌టీయూసీ లక్ష్యాలకు అనుగుణంగా కార్మికుల మధ్య ఐక్యతను పెంచి సంఘం పటిష్ఠత కోసం ప్రతిపాదించిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సంజీవరెడ్డి ఈ సందర్భంగా హన్మంతు ముదిరాజ్‌కు సూచించారు. 2017, 2021 పీఆర్‌సీల అమలు కోసం పోరాడుతామని హన్మంతు ముదిరాజ్ పేర్కొన్నారు.

నీటి బిల్లుల జారీలో గందరగోళం

● నెలల తరబడి జాప్యం ● ఫోన్ యాప్ తెచ్చినా ఫలితం శూన్యం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు జారీ చేస్తున్న నీటి బిల్లులు గందరగోళంగా మారాయి. మీటర్ రీడర్లతో బిల్లులు జారీ చేస్తే సమస్యలు తలెత్తుతున్నాయని భావించి ఫోన్ యాప్ తీసుకొచ్చినా ఫలితం ఉండడంలేదు. మీటర్‌రీడర్ నల్లామీటర్ ఫొటో తీసి వాటర్‌బోర్డు ఫోన్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా బిల్లులు సక్రమంగా రావడంలేదు. నెలల తరబడి ఆలస్యం చేయడంతో పాటు ఇష్టానుసారంగా బిల్లులు వేస్తున్నారు. అడ్డగోలుగా వస్తున్న బిల్లులను ఏవిధంగా చెల్లించాలని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలుప్రాంతాల్లో వాటర్‌బోర్డు నీటిసరఫరాతో పాటు బిల్లులు వసూలు చేస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని గృహ కనెక్షన్లకు నెలకు 20 వేల లీటర్ల వరకు తాగునీటిని ఉచితంగా అందిస్తున్నారు. అంతకు మించి నీటిని వినియోగిస్తే బిల్లులు జారీ చేస్తున్నారు. ఇందుకోసం నీటి మీటర్లే ప్రామాణికంగా మారాయి. మెకానికల్ నీటి మీటర్‌తో సమస్యలు వస్తున్నాయని వాటి స్థానంలో ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) మీటర్లను తీసుకొచ్చారు. గతంలో మీటర్ రీడర్లు ఇంటింటికీ వెళ్లి వీటిలో వచ్చే రీడింగ్‌ను ఈ-పాస్ మిషన్లలో నమోదు చేసి బిల్లు ఇచ్చేవారు. మీటర్ రీడర్లు తక్కువ రీడింగ్ నమోదు చేసి అవకతవకలకు పాల్పడుతున్నారని భావించి మొబైల్ యాప్ తీసుకొచ్చారు. మీటర్ రీడర్ ఇంటింటికీ తిరిగి ఏఎంఆర్ మీటర్ రీడింగ్‌ను ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. డీజీఎం స్థాయి అధికారులు డివిజన్ల వారీగా మీటర్ రీడింగ్‌ను పరిశీలించి బిల్లు వేస్తారు. ఆ బిల్లును ఆన్‌లైన్‌లోనే పొందాల్సి ఉంటుంది. లేకుంటే మీటర్ రీడర్ మరోసారి రీడింగ్‌కు వచ్చినపుడు ఇస్తారు.

మీటర్ రీడర్ ఫొటో తీసి పంపినా బిల్లు రావట్లేదు



మీటర్ రీడింగ్ ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్న రీడర్

కమర్షియల్, గృహ కనెక్షన్ల మీటర్ రీడింగ్‌లను రీడర్లు ఫొటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నా అధికారులు వెంటనే పరిశీలించడం లేదు. రెండు, మూడు నెలల బిల్లులు ఒకేసారి ఇస్తున్నారు. చెల్లించకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు. దాంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మీటర్ రీడింగ్ కంటే అధికంగా బిల్లులు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎల్‌బీ నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో తమకు ప్రతి నెలా బిల్లు వచ్చేదని, ప్రస్తుతం రెండు, మూడు నెలలకోసారి ఇస్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న శ్యామ్‌కుమార్

ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం

తిరుమలగిరి ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పెద్ద కమేలా సమీపంలోని లాలమియా బస్తీ పక్కనే ఉన్న గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంను కంటోన్మెంట్ బోర్డు వార్డ్-7 మాజీ సభ్యులు ప్యారసాని శ్యామ్‌కుమార్, ప్యారసాని భాగ్యశ్రీలు గురువారం ప్రారంభించారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ శాంతన్, ఆర్థో డాక్టర్ శ్రావణ్ కుమార్, గైనకాలజీ, డెంటల్ డాక్టర్ ఉమాదేవి, ఆప్తాలమిక్ డాక్టర్ అనీషా దీప్తి, చిన్న పిల్లల వైద్యులు, రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైనవారికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తామని తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన రోగులు అధిక సంఖ్యలో విచ్చేసి ఉచిత మెగా వైద్య శిబిరంలో వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో వార్డ్-7కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

'విక్షిత్ భారత్-విక్షిత్ రైల్వే' అంశంపై పోటీలకు స్పందన

సికింద్రాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు '2047- విక్షిత్ భారత్ - విక్షిత్ రైల్వే' అంశంపై దక్షిణమధ్య రైల్వే పరిధిలో గురువారం నిర్వహించిన వ్యాసరచన, పెయింట్, వక్తృత్వ పోటీలకు వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలలో జరిగిన పోటీల్లో 37,351 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ పెయింటింగ్‌లు, వ్యాసాలు, ఉపన్యాసాల ద్వారా విక్షిత్ భారత్‌తో విక్షిత్ రైల్వే గురించి తమ భావాలు వ్యక్తీకరించారు. అభివృద్ధి చెందిన భారతదేశం వివిధ కోణాలను విద్యార్థులు అర్థం చేసుకుని, అందులో రైల్వేల భాగస్వామ్యం గురించి వివరించారు. పోటీల్లో విజేతలకు ఈనెల 26వ తేదీన బహుమతి ప్రదానం చేస్తారు. కాగా పోటీల్లో పాల్గొన్న వారిని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి దేవాలయంలో సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గర్భాలయంలో అమ్మవారి మూలమూర్తులను 108 చీరలతో సుందరంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చనల కోసం స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ దేవాలయానికి పసుపు, కుంకుమలను అందజేశారు. పూజా కార్యక్రమాలలో పాల్గొన్న మహిళా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ సురిటి రామేశ్వర్, ధర్మకర్తలు అన్ని ఏర్పాట్లను చేశారు.



పసుపు, కుంకుమ ఇస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

మంచి శిక్షణ పొంది సమాజ అభివృద్ధికి కృషి చేయాలి

● రోచల్‌దాస్ జెత్వాని

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్కౌటింగ్‌లో ఇస్తున్న మంచి శిక్షణను విద్యార్థులందరూ పొంది సమాజాభివృద్ధికి కృషి చేయాలని విశ్వసింధీ సేవాసంఘ్ జాతీయ అధ్యక్షులు రోచల్‌దాస్ జెత్వాని పిలుపునిచ్చారు. స్కౌట్ (బాలుర) ఉద్యమ వ్యవస్థాపకులు లార్డ్ స్టీఫెన్‌సన్ స్మిత్ బెడెన్ పావెల్, గైడ్ (బాలికల) ఉద్యమ వ్యవస్థాకురాలు లేడీ బెడెన్ పావెల్ జయంతి సందర్భంగా గురువారం సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులో గల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ ఆవరణలో వరల్డ్ థింకింగ్ డే వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయిన రోచల్‌దాస్‌కు విద్యార్థులు స్కౌట్ సాంప్రదాయమైన కలర్ పార్టీ ద్వారా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నేను కూడా చిన్నప్పుడు మీ అందరిలాగే స్కౌటింగ్ చేసినవాడినేనని తన బాల్య స్మృతులను గుర్తుచేసుకున్నారు. అంతకు ముందు జిల్లా చీఫ్ కమిషన్ కె.దేవ్‌దత్, కార్యదర్శి కె.రమేష్‌చందర్‌లు మాట్లాడుతూ... స్కౌట్ ఉద్యమం గురించి, ఇందులో ఇచ్చే శిక్షణ గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. వేడుకలలో జిల్లా కమిషనర్‌లు మెహర్నేజ్ భతేనా, సరస్వతి, స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ విజయ్ భాస్కర్, ఆర్గనైజింగ్ కమిషనర్ గౌరీనాథ్, గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్ సంగీతా పాండే, సంయుక్త కార్యదర్శి రీటా ల్యాకే, మాజీ బ్యాంక్ మేనేజర్ విష్ణు స్వరూప్, హిమాలయన్ ఉడ్ బ్యాచ్ హోల్డర్‌లు విష్ణు ప్రసాద్, వనంరాజు, స్కౌట్ మాస్టర్ మల్లారెడ్డి, నాగేంద్ర, గైడ్ క్యాప్టెన్ వెంకట శివలీలతో పాటు వివిధ పాఠశాలల స్కౌట్ మాస్టర్లు, గైడ్ క్యాప్టెన్లు, రోవర్స్ రేంజర్స్ స్కౌట్స్, గైడ్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రోచల్‌దాస్ జెత్వాని

రక్తదానం ప్రాణదానంతో సమానం

● రైల్వే మెడికల్ డైరెక్టర్. డా.నిర్మల

చిలకలగూడ,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ రైల్వే నర్సెస్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లాలాగూడ, కేంద్రీయ రైల్వే ఆస్పత్రి మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో వున్నవారికి, ప్రమాదాల బారిన పడిన వారికి అత్యవసరంగా రక్తం అవసరమయినపుడు, తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని దేశవ్యాప్తంగా వున్న రైల్వే నర్సులు చేస్తున్న కార్యక్రమాన్ని కొనియాడారు. నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం శుక్రవారంతో ముగియనున్నట్లు, రక్తదాతలతో ఒక గ్రూప్ ఏర్పాటు చేసి అత్యవసరమైన వారికి రక్తం అందజేయటానికి చర్యలు చేపడుతున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, అర్ల రేణుక, రాజ్‌కుమార్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అజిలాల్, లీల, కృష్ణవేణి, అమృత, బినోజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు స్పెషల్ డ్రైవ్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నార్త్ జోన్ పరిధిలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించి క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధ, గురువారం రెండు రోజులపాటు మారేడ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో హోటల్స్, షాపింగ్ మాల్స్, బిజినెస్ సెంటర్స్, చౌరస్తాల్లో విచ్చలవిడిగా పార్కింగ్ చేసిన వాహనదారులకు, దుకాణాల నిర్వహకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజినెస్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉద్యోగులు వచ్చిపోయే మార్గాల్లో వాహనదారులకు, పాదచారులకు, ఇబ్బంది లేకుండా క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ముందుగా ఒకసారి అక్రమ పార్కింగ్ చేసే వారిపై కౌన్సిలింగ్ ఇస్తామని, తరువాత చలానాలు వేస్తామని, తర్వాత కోర్టుకు పంపించడం జరుగుతుందని, మూడు దశలవారీగా చర్యలు చేపడతామని వివరించారు. ఫుట్‌పాత్ వ్యాపారస్తులు నిబంధనలు పాటించకుండా అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈస్ట్, వెస్ట్ మారేడ్‌పల్లి ప్రధాన మార్గాల్లో ఉన్న వైన్స్, పర్మిట్‌లలో మద్యం సేవించడానికి వచ్చేవారు ఏకంగా ప్రధాన రోడ్లపై అక్రమ పార్కింగ్‌లు చేస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మద్యం సేవించే వారి కోసం తినుబండారాలను సైతం అందించేందుకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని చిరు వ్యాపారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. వారి ఆధీనంలో ఉన్న స్థలాలను వాడుకొని వ్యాపారాలు చేసుకొంటే వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉంటాయని సూచించారు. ప్రతి వాహనదారులు వ్యాపారనిర్వాహకులు నిబంధనలు పాటించి ప్రమాదాలు లేకుండా హైదరాబాద్ నగరానికి ఉన్న పేరుప్రతిష్టలను కాపాడాలని ఆయన సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో మారేడ్‌పల్లి ట్రాఫిక్ సీఐ భాస్కర్, ఎస్ఐలు రామచందర్ నాయక్, మహేష్, సంజీవరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాదారులకు, వాహనదారులకు ట్రాఫిక్ సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు



పోచమ్మ ఆలయం వీధిలో రోడ్డును పరిశీలిస్తున్న జలమండలి జీఎం వినోద్‌కుమార్, జీహెచ్ఎంసీ అధికారులు

పోచమ్మ గుడి వీధిలో రోడ్డు నిర్మిస్తాం

బౌద్ధనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో త్వరలో నూతన రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో జీహెచ్ఎంసీ, జలమండలి నిర్లక్ష్యం, తవ్వినరోడ్డుతో వారాసిగూడ ప్రజలు ఇబ్బందులు పేరుతో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు స్పందించారు. మారేడుపల్లి జలమండలి జీఎం వినోద్‌కుమార్, డీజీఎం కృష్ణ, మేనేజర్ ప్రియాంక, జీహెచ్ఎంసీ డీఈ ప్రశాంతి, ఏఈ శశిధర్‌రెడ్డి తదితరులు తవ్వినరోడ్డును పరిశీలించారు. ఇంతకుముందే సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, కాంట్రాక్టర్ సీసీ రోడ్డు నిర్మాణ టెండర్‌ను రద్దు చేసుకున్నాడని అధికారులు తెలిపారు. మరల రీ టెండర్‌ను పిలిచి త్వరలో నూతన సీసీ రోడ్డును చేపడతామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మంత్రి జూపల్లి కృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరిస్తున్న యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు

ముగింపు వేడుకలకు మంత్రికి ఆహ్వానం

తిరుమలగిరి ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండవ కార్డినల్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్ ఆటను తిలకించి విజేతలకు బహుమతులు అందజేయాలని కోరుతూ గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావును కలసి నిర్వాహకులు ఇన్విటేషన్ అందచేశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ విక్టర్ అముల్ రాజు, అల్వాల్ మునిసిపల్ మాజీ చైర్మన్ జీవకన్, యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి మైఖెల్ అబ్రహంలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిల్‌కుష్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎ.శ్రీనివాస్ (28), భార్య మౌనికలు బోయిన్‌పల్లి నందమూరినగర్ సమీపంలో ఉన్న దిల్‌కుష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారు. శ్రీనివాస్ టెక్ మహేంద్రలో ఎగ్జిక్యూటీవ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో భార్య మౌనికకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో హాస్పిటల్‌లో పరీక్షలు చేయించుకోవడానికి బేగంపేట్‌లో ఉంటున్న తన తల్లి వద్దకు వెళ్ళింది. అయితే బుధవారం రాత్రి శ్రీనివాస్ నైట్‌డ్యూటీ ముగించుకుని ఇంటికి తిరిగివచ్చి ఇంట్లో పడుకున్నాడు. రాత్రి 9 గంటల సమయంలో బయటకు వెళ్ళివచ్చిన శ్రీనివాస్ తల్లి ఇంటి తలుపు తీయమని పిలిచినా లోపలి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అప్పటికే భార్య మౌనిక కూడా ఇంటికి చేరుకొని విషయం తెలుసుకుని వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ భర్త కనిపించాడు. దీంతో తలుపులు బద్దలు కొట్టి కొన ఊపిరితో వేలాడుతున్న శ్రీనివాస్‌ను హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కానీ శ్రీనివాస్ అప్పటికే మృతిచెందినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా శ్రీనివాస్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు వెల్లడించారు.

మద్యం మత్తులో రోడ్డుపైన పడిన వ్యక్తి మృతి

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రోడ్డుపై పడి గాయాలపాలైన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బోయిన్‌పల్లి ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం... న్యూబోయిన్‌పల్లి సంజీవయ్యనగర్ బస్తీకి చెందిన మల్లేష్ (69) జీహెచ్ఎంసీ రిటైర్డ్ ఉద్యోగి. కుటుంబ కలహాలకారణంగా గత కొంతకాలంగా మల్లేష్ భార్య, పిల్లలు వేరుగా ఉంటున్నారు. దీంతో మల్లేష్ పారిశుధ్య కార్మికునిగా పనిచేసుకుంటూ ఒంటరిగానే ఉంటున్నాడు. మద్యానికి బానిసైన మల్లేష్ బుధవారం మధ్యాహ్నాం స్థానికంగా ఉన్న రాయల్ ఫర్నిచర్ దుకాణం ఎదురుగా అపస్మారక స్థితిలో గాయాలతో పడి ఉన్నాడని స్థానికులు అతని తమ్ముడి కుమారుడు సాయికిరణ్‌కు ఫోన్ చేశాడు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న సాయికిరణ్ మల్లేష్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మల్లేష్ గురువారం మృతిచెందినట్లు ఆస్పత్రివర్గాలు వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.



బాలికతో భవానీనగర్ పోలీసులు

తప్పిపోయిన బాలిక.. తమిళనాడులో గుర్తింపు

హోమ్‌కు తరలించిన భవానీనగర్ పోలీసులు

యాకుత్‌పురా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధితో బాధపడుతూ గతేడాది తప్పిపోయిన బాలికను భవానీనగర్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. తమిళనాడు చెన్నై సిటీలో ఆమెను గుర్తించిన పోలీసులు ఆమెకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో సికింద్రాబాద్‌లో బన్సీలాల్‌పేట్ హోమ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్‌రెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్ వి.నరేందర్ కథనం ప్రకారం.. పాతబస్తీ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ జుబేర్ కూతురు ఆస్సియా బేగం(17) గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుంది. ఆమె కుటుంబ సభ్యులు ఆస్సియా బేగాన్ని గొలుసులతో కట్టేసి ఉంచుతూ నగరంలోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్సలు అందించారు. గత సంవత్సరం అక్టోబర్ 12న జుబేర్ పని నిమిత్తం బయటికి వెళ్లగా ఆస్సియా బేగం గొలుసు తెంచుకొని బయటికి వెళ్లిపోవడంతో గత సంవత్సరం డిసెంబర్ 20న పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు తమిళనాడులోని చెన్నై సిటీ కిల్పాక్ విలేజ్ బాలవిహార్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఆస్సియా బేగంను నగరంలో ఉన్న తన తండ్రితో మాట్లాడించారు. ఆ తర్వాత రెండురోజుల్లో తండ్రి గుండెపోటుతో మరణించాడు. దీంతో ఆస్సియా బేగంను నగరానికి మంగళవారం తీసుకొచ్చి నింబొలిఅడ్డాలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీలో హాజరుపర్చగా, అక్కడి నుంచి ఆమెను సికింద్రాబాద్‌లో బన్సీలాల్‌పేట్ హోమ్‌కు తరలించారు.